క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో బృహతి సహస్రయాగం



మల్దకల్: ఆదిశిలా క్షేత్రంలోని కల్యాణ మండపంలో ఆదివారం బృహతి సహస్రయాగం నిర్వహించారు. వేదపండితులు మధుసూదనాచారి, రమేషాచారి, నాగరాజుశర్మ, దీరేంద్రదాసుల మంత్రోచ్ఛరణల మధ్య ప్రత్యేక గరుఢ హోమం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచే కాకుండా కర్ణాటక నుంచి భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. వర్షాలు కురిసి సమృద్ధిగా పంటలు పండాలని యాగం నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు అరవిందరావు, చంద్రశేఖర్‌రావు, బాబూరావు పాల్గొన్నారు.

సుష్మా స్వరాజ్‌కు నివాళి



అయిజ: పట్టణంలోని బీజేపీ కార్యాయలంలో ఆదివారం సుష్మా స్వరాజ్ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి మాట్లాడుతూ కేంద్ర మంత్రిగా సుష్మా స్వరాజ్ ప్రజలకు ఎనలేని సేవలు అందించారని, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు విశేష కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు వెంకటేష్, నర్సింహయ్యశెట్టి, ఆదినారాయణ పాల్గొన్నారు.

రేపు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండల కేంద్రంలో ఈనెల 8న కాంగ్రెస్ పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించనున్నట్లు అలంపూర్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జోగుల రవి తెలిపారు. ఎర్రవల్లి చౌరస్తాలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ బలోపేతం తదితర అంశాలపై నిర్వహించనున్న సమావేశానికి మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువత అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. సమావేశంలో రుక్మాందర్‌రెడ్డి, వెంకటేష్, రాజ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

హామీల అమలులో విఫలం

గద్వాల అర్బన్: బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఎంఐఎం నాయకులు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హామీలు కేవలం మాటలకే పరిమితమయ్యాయని విమర్శించారు. గద్వాల నియోజకవర్గంలో మొదలుపెట్టిన పనులను ఇప్పటి వరకు పూర్తి చేయలేదన్నారు. గుర్రంగడ్డ, డబుల్‌బెడ్రూం ఇళ్లు, చేనేత పార్కు, మైనార్టీ రుణాలు, షాదీఖానా, బీసీ రుణాలు, గోన్‌పాడు వద్ద షాదీఖానా నిర్మాణాలు ఇంకా పూర్తి కాలేదన్నారు. సమావేశంలో ఎంఐఎం నాయకులు మొహమ్మద్ జానీ, రఫీ, వసీమ్, రఫీ, వలి ఉన్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

ధరూరు : పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన మండలంలోని పెద్దపాడులో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన యువకుడు రంగస్వామి తల్లిదండ్రులతో కలిసి వ్యవసాయ పనులు చేస్తూ జీవిస్తున్నాడు. ఆదివారం పొలం పనులకు వెళ్లి ఇంటికొచ్చాడు. రాత్రి 9 గంటల సమయంలో గ్రామ సమీపంలోని బీడు భూమిలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కొడుకు ఇంకా ఇంటికి రాలేదని తల్లి మామను చూసిరమ్మని పంపించింది. అప్పటికే పొలంలో పురుగుల మందు తాగి పడున్న అతన్ని ఇంటికి తీసుకొచ్చి చికిత్స కోసం గద్వాలకు తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం కర్నూల్‌కు తరలించారు. రంగస్వామి ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు తెలియరాలేదు.

కేసు నమోదు

అయిజ: గొర్రెల అపహరణకు యత్నించిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నరేష్ కుమార్ తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు.. మల్దకల్ మండలం ఉలిగపల్లికి చెందిన కుర్వ కృష్ణ అయిజ మండలం ఉప్పల శివారులో గొర్రెలను మేపుకుంటుండగా, శనివారం రాత్రి గుర్తుతెలియని దుండగులు గొర్రెలను అపహరించేందుకు వచ్చారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేసి ముగ్గురు అనుమానితులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కార్మికులకు వైద్యపరీక్షలు

అమరచింత: కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో లేబర్ కార్డు ఉన్న ప్రతి కార్మికుడికి ఉచిత వైద్య పరీక్షలను నిర్వహిస్తున్నామని జిల్లా కోఆర్డినేటర్ తౌఫిక్‌అహ్మద్ తెలిపారు. పట్టణంలోని మున్సిపల్, తహసీల్దార్ కార్యాలయాల్లో ఆదివారం కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను పంపిణీ చేశారు.

ఆదాయం జాస్తి.. సౌకర్యాలు నాస్తి

- పశువుల సంతలో వసతులు కరువు
- క్రయవిక్రయదారుల అవస్థలు
- పట్టించుకోని పాలకులు

అయిజ: వారాంతపు పశువుల సంతలో కనీస సౌకర్యాలు కరువయ్యాయి. మున్సిపాలిటీలోని మార్కెట్ సబ్‌యార్డులో ప్రతి గురువారం జరిగే సంతలో ఎద్దులు, ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకల క్రయవిక్రయాలు జోరుగా సాగుతాయి. జిల్లాలోనే ఏకైక పశువుల సంతగా పేరుగాంచింది. సంతలో కనీస సౌకర్యాలు కల్పించకపోవడంతో క్రయవిక్రయదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీకి పశువుల సంతతో ఆదాయం బాగానే సమకూరుతున్నా మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించడంలేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సంతకు పెరుగుతున్న ఆదరణ..

నడిగడ్డలో వ్యవసాయ ఆధారంగా జీవించే వారు ఎక్కువగా ఉండటం.. పంటలు పండించేందుకు రైతులు ఎద్దులను ఉపయోగించడం సంప్రదాయంగా వస్తోంది. వ్యవసాయ అనుబంధంగా పాడి పశువులనూ పెంచుతున్నారు. వాటి క్రయవిక్రయాలకు అయిజ మార్కెట్ సబ్‌యార్డులో 2018 అక్టోబర్ 18న పశువుల సంతను ఏర్పాటు చేశారు. సంతను అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో గొర్రెలు, మేకలు విక్రయిస్తే ఒక్కొక్క దానికి రూ.10, ఆవులు, గేదెలు, ఎద్దులకు రూ.50 చొప్పున రుసుము వసూలు చేస్తున్నారు.

మౌలిక వసతులు కరువు..

నిబంధనల మేరకు పశువుల సంతకు వచ్చే ఆదాయంతో క్రయవిక్రయదారులకు మౌలిక వసతులు కల్పించాలి. క్రయవిక్రయదారులకు మంచి నీటి వసతితోపాటు పశువుల విక్రయానికి షెడ్లు ఏర్పాటు చేయాలి. పశువుల ఎరువును ఎప్పటికప్పుడు ఎత్తివేసి మార్కెట్‌యార్డును శుభ్రంగా ఉంచాలి. పశువుల ఎరువుకు వేలం వేసి ఆదాయం సమకూర్చుకోవాలి. పశువులకు నీటితొట్లు ఏర్పాటుతోపాటు క్రయవిక్రయదారులకు విశ్రాంతి భవనాలు ఏర్పాటు చేయాలి. అయితే అధికారులు ఇవేవీ ఏర్పాటు చేయలేదు. దానికి తోడు పశువుల సంత నిర్వహిస్తున్న స్థలం గుంతలమయంగా ఉండడంతో వర్షాకాలంలో నీటితో నిండి ఉంటుంది. సంత స్థలంలో పిచ్చిమొక్కలు పెరిగాయి. దీంతో క్రయవిక్రయదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి పశువుల సంతలో మౌలిక వసతులు కల్పించాలని కోరుతున్నారు.



అయిజ పశువుల సంత

ఆర్థిక సంవత్సరం	వార్షిక ఆదాయం
2018-19	రూ.1,035,40
2019-20	రూ.1,94,720
2020-21	రూ.1,21,580
2021-22	రూ.1,48,060
2022-23	రూ.2,24,020

2023 ఏప్రిల్ 1నుంచి జూలై 20 వరకు పశువుల సంత ద్వారా రూ. 2,81,000 ఆదాయం సమకూరింది.



సంత స్థలంలో నిలిచిన వర్షపునీరు

మౌలిక వసతులు కల్పించాలి..



మార్కెట్ యార్డులో నిర్వహిస్తున్న పశువుల సంతలో మౌలిక వసతులు కల్పించాలి. పశువులకు తాగునీటిని ఏర్పాటు చేయడంతోపాటు నీడ సౌకర్యం ఏర్పాటు చేయాలి. వర్షం కురిస్తే మనుషులు చెట్ల కిందకు పరుగెత్తాల్సి వస్తుంది. క్రయవిక్రయాలు నిర్వహించే వారికి విశ్రాంతి భవనం ఏర్పాటు చేస్తే బాగుంటుంది. మార్కెట్‌కు వస్తున్న ఆదాయాన్ని మౌలిక వసతులు కల్పించేందుకు ఖర్చు చేయాలి.

– తిప్పన్న, ఈడుగోనిపల్లి

మార్కెట్ ఫీజు పెంచారు..



ఐదేళ్ల నుంచి అయిజలో పశువుల సంత నిర్వహిస్తున్నారు. పశువులను కొనుగోలు చేసిన వారి నుంచి మార్కెట్ ఫీజు నామమాత్రంగా వసూలు చేసేవారు. గొర్రెలు, మేకలకు ఒక్కొక్క దానికి రూ.10, ఆవులు, గేదెలకు రూ.50 చొప్పున వసూలు చేశారు. ఈ ఏడాది నూటికి రూపాయి చొప్పున వసూలు చేస్తుండడంతో రైతులకు భారంగా మారింది. ఎప్పటిలాగా మార్కెట్ ఫీజు వసూలు చేస్తే బాగుంటుంది.

– శ్రీనివాసులు, అయిజ

అసౌకర్యంగా ఉంది..



సంతలో పశువులను విక్రయించే స్థలం గుంతలమయంగా మారి వర్షపునీరు నిల్వ ఉంటుంది. వర్షాకాలంలో పశువుల క్రయవిక్రయాలకు ఇబ్బందిగా మారింది. గుంతలను పూడ్చి పిచ్చి మొక్కలను తొలగించాలి. క్రయవిక్రయదారులకు మౌలిక వసతులు కల్పిస్తే బాగుంటుంది. పశువులకు నీటితొట్లు, రైతులకు విశ్రాంతి భవనం ఏర్పాటు చేయాలి.

– మేకల నాగిరెడ్డి, రైతు సంఘం మండల అధ్యక్షుడు

మౌలిక వసతుల కల్పనకు కృషి..



ఐదేళ్లుగా అయిజలో పశువుల సంత నిర్వహిస్తున్నాం. మార్కెట్ సబ్‌యార్డులో మేకలు, గొర్రెలతోపాటు పశువుల క్రయవిక్రయాలు జరుగుతున్నాయి. మౌలిక వసతులు కల్పించేందుకు నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులకు పంపిస్తాం. మార్కెట్ ఫీజు నిబంధనల ప్రకారం రూ.వందకు రూపాయి వసూలు చేయాలి. అదేవిధంగా వసూలు చేస్తున్నాం.

– పుష్పమ్మ, జిల్లా మార్కెటింగ్ ఆఫీసర్

ఘనంగా స్నేహితుల దినోత్సవం



ఉండవెల్లి పాఠశాలలో కేక్ కట్ చేస్తున్న స్నేహితులు



ఎర్రవల్లి చౌరస్తా తక్కశీల పాఠశాలలో స్నేహితుల దినోత్సవంలో పాల్గొన్న చిన్నారులు

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని పలు గ్రామాల్లో స్నేహితుల దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఫ్రెండ్షిప్ బ్యాండ్ కట్టుకొని మిఠాయిలు తినిపించుకున్నారు.

ఉండవెల్లి: మండల కేంద్రంలోని ఆదర్శ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో స్నేహితుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకొన్నారు. ఒకరినొకరు మిఠాయిలు తినిపించుకొని శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. కార్యక్రమంలో వెంకట్‌గౌడ్, కృష్ణ, నర్సప్ప, వెంకటేశ్వర్లు, హనీఫ్, నాయుడు, వెంకటేష్, శ్రీరాములు, మురళి పాల్గొన్నారు.

అయిజ: మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో ఆదివారం స్నేహితుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్‌లు కట్ చేసి.. ఒకరినొకరు స్వీట్లు తినిపించుకున్నారు. పట్టణంలో నిర్వహించిన స్నేహితుల దినోత్సవంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

దైవచింతనతో జీవించాలి



ధరూరు: ప్రతి ఒక్కరూ దైవచింతనతో జీవించాలని రెవ పాస్టర్ నరేష్‌పాల్ అన్నారు. ఆగస్టు మొదటి ఆదివారం బల్లారాధన కార్యక్రమం సందర్భంగా మండల కేంద్రంలోని ఎంబీ షాలేము చర్చితోపాటు హోసన్న మందిరం, మరనాథ విస్వాస సమాజ మందిరం, బాప్టిస్టు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా క్రైస్తవులనుద్దేశించి బైబిల్ ప్రవచనాల ఆధారంగా బోధించారు. అనంతరం ప్రభుసంస్కార (సహపంక్తి) భోజనం చేశారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు సత్యన్న, సైదన్న, సీమోను, డేవిడ్, దానియేలు, ఎజ్రా, యోబు పాల్గొన్నారు.

జయశంకర్ ఆశయాలు సాధిద్దాం



అలంపూర్‌లో జయశంకర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మనోరమ

అలంపూర్: తెలంగాణ ఉద్యమ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ మనోరమ అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో జయశంకర్ జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మున్సిపల్ చైర్‌పర్సన్ మాట్లాడుతూ తెలంగాణ సాధన కోసం ప్రొఫెసర్ జయశంకర్ అలుపెరగని పోరాటం చేశారని కొనియాడారు. అదేవిధంగా బీఆర్‌ఎస్ కార్యాలయంలో ప్రొఫెసర్ జయశంకర్ జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ మోహన్‌రెడ్డి, జయరాముడు, వెంకట్రామయ్యశెట్టి, నర్సన్నగౌడ్, పెద్దమోక్తార్, మద్దిలేటి, రాజేష్, నాగేంద్ర, ఆంజనేయులు, హరిబాబు, సురేష్, శ్రీనివాసులు, నాగేషులు, సామెల్, రాజు పాల్గొన్నారు. అలంపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ రమేష్ ఆధ్వర్యంలో జయశంకర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

గద్వాల అర్బన్: తెలంగాణ ఉద్యమ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ అని జిల్లా సాహితీ అధ్యక్షుడు అంబటి భానుప్రకాష్ అన్నారు. జిల్లా కేంద్రంలోని నది అగ్రహారం స్నాతకోత్తర కేంద్రం పీజీ కళాశాలలో జయశంకర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం భానుప్రకాష్ మాట్లాడుతూ తెలంగాణ తొలి, మలిదశ ఉద్యమంలో ప్రత్యక్షంగా పాల్గొని ఊరూరా తన ప్రసంగాలతో ప్రజలను చైతన్యం చేశారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సాహితీ కార్యదర్శి మహేందర్, జయన్న, భాస్కర్, మంగళగిరి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

అయిజ: ప్రొఫెసర్ జయశంకర్ జయంతిని మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అఖిలపక్ష మండల కమిటీ నాయకులు ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆరు దశాబ్దాల తెలంగాణ ఉద్యమంలో జయశంకర్ అలుపెరగని పోరాటం చేశారని కొనియాడారు.

ఉండవెల్లి: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఆచార్య జయశంకర్ జయంతిని ఏఎస్ఐ అయ్యన్న ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ ప్రసాద్, ఎంపీటీసీ రాజశేఖర్ పాల్గొన్నారు.



గద్వాలలో జయశంకర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



అయిజలో జయశంకర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న అఖిలపక్ష నాయకులు

ప్రతి సమస్యను పరిష్కరిస్తాం



మాట్లాడుతున్న ఎంపీపీ అశోక్‌రెడ్డి

మానవపాడు: గ్రామాల్లో నెలకొన్న ప్రతి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఎంపీపీ అశోక్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. పంచాయతీరాజ్ రోడ్ల నిర్మాణం, 108 అంబులెన్స్ ఏర్పాటు, గట్టులో కొనసాగుతున్న గురుకుల పాఠశాల మానవపాడుకు తీసుకురావడానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. మానవపాడు నుంచి చెన్నిపాడు, పెద్దపోతులపాడు మీదుగా అలంపూర్ చౌరస్తాకు వెళ్లే ప్రధాన రహదారి గుంతలమయంగా తయారైందని, విషయాన్ని ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. మద్దూరు గ్రామంలో చేపట్టాల్సిన పనులపై పంచాయతీ తీర్మానం ఇవ్వడంలేదని, ఎవరూ అడ్డుకున్నా అభివృద్ధి పనులు చేపట్టి తీరుతామన్నారు. కాగా రైతు సంబరాలకు సంబంధించిన బిల్లులు, క్రీడాప్రాంగణాల మెటీరియల్ బిల్లులు ఇంతవరకు రాలేదని సర్పంచ్ ఆత్మలింగారెడ్డి సభ దృష్టికి తీసుకొచ్చారు. కలుకుంట్ల రోడ్డు అధ్వానంగా మారడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. చాలా గ్రామాల్లో విద్యుత్ సమస్య నెలకొందని ఎంపీటీసీ స్వాములు సభ దృష్టికి తీసుకొచ్చారు. ఆరోగ్యకేంద్రంలో అవసరమైన మందులను అందుబాటులో ఉంచాలని కోరారు. సమావేశంలో ఉపాధ్యక్షుడు సోమ్మన్నగౌడ్, ఎంపీడీఓ రమణారావు, డాక్టర్ ఇర్షాద్, ఎంఈఓ శివప్రసాద్, ఏఈ నాగేందర్, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు ఉన్నారు.

గొల్లకురుమల అభ్యున్నతికి కృషి



గొర్రెలు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు

కేటీదొడ్డి: గొల్లకురుమల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎంపీపీ మనోరమ అన్నారు. మండలంలోని ఎర్సందొడ్డిలో ఆదివారం సబ్సిడీ గొర్రెలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ అన్నివర్గాల సంక్షేమానికి పాటుపడుతున్నారన్నారు. ప్రభుత్వం సబ్సిడీపై అందించిన గొర్రెలతో మందను పెంపొందించుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని లబ్ధిదారులకు సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రాజశేఖర్, వైస్‌ఎంపీపీ రామకృష్ణనాయుడు, ఉరుకుందు, సర్పంచ్ గోపాల్‌యాదవ్, తిక్కన్న, చక్రధర్, పశువైద్యాధికారి వినయ్ తదితరులు పాల్గొన్నారు.

రైతన్న సంక్షేమానికి పెద్దపీట



సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలభిషేకం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

మానవపాడు: రైతు సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేసి పథకాలను అమలు చేస్తోందని సర్పంచ్ నర్సింహులు అన్నారు. మండలంలోని చండూరులో ఆదివారం సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే అబ్రహం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తీసుకున్న పంట రుణాలను ప్రభుత్వం మాఫీ చేయడం హర్షణీయమన్నారు. రైతుల అభ్యున్నతికి సీఎం కేసీఆర్ అహర్నిశలు కృషి చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు శంకర్‌నాయుడు, కృష్ణయ్య నాయుడు, ఈశ్వరయ్య, గణపతినాయుడు, బీచుపల్లి, పెద్దరాముడు, మద్దిలేటి, రాజు, రాముడు, బీచుపల్లి, గాలెన్న పాల్గొన్నారు.

పశువుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి



టీకాలు వేస్తున్న పశువైద్య సిబ్బంది

శాంతినగర్: పశువుల ఆరోగ్యంపై పెంపకందారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని వెటర్నరీ డాక్టర్ పుష్పలత అన్నారు. వడ్డేపల్లి మండలంలోని తనగల, కోయిల్‌దిన్నె గ్రామాల్లో ఆదివారం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వానాకాలంలో వచ్చే గాలికుంటు వ్యాధితో పశువులు నడవలేక సతమతమవుతాయన్నారు. ఎద్దులు పొలం పనులు చేయలేని స్థితికి చేరుతాయని తెలిపారు. పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించాలని కోరారు. మొత్తం 266 గేదెలు, 124 ఆవులకు టీకాలు వేసినట్లు తెలిపారు. అదేవిధంగా దూడలకు నట్టల నివారణ మందు తాగించినట్లు పేర్కొన్నారు. సిబ్బంది వరప్రసాద్, షేక్ లతీఫ్, రవి, వెంకటమ్మ, కృష్ణ, గోపాలమిత్రలు విద్యాసాగర్, లక్ష్మన్న, నారాయణగౌడ్ పాల్గొన్నారు.

బీజేపీది కార్మిక వ్యతిరేక పాలన



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటస్వామి

గద్వాల అర్బన్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా వ్యవహరిస్తూ.. కార్మిక వ్యతిరేక పాలన సాగిస్తోందని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి అన్నారు. జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన హమాలీల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వరంగ సంస్థలను స్వదేశీ, విదేశీ కార్పొరేట్లకు అమ్మేస్తుందని ఆరోపించారు. నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయడంతోపాటు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన కనీస వేతనాల జీవోలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. గ్రామపంచాయతీ కార్మికులను రెగ్యులరైజ్ చేసి వేతనాలు పెంచాలన్నారు. బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 9, 10 తేదీల్లో జిల్లా కేంద్రాల్లో మహాపడావ్, మహాధర్నా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని కార్మికులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో బజార్ హమాలీ యూనియన్ అధ్యక్షుడు ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి నర్సింహులు, కోశాధికారి తిరుపతన్న, రఘు, వెంకటేష్, కళ్యాణ్, వీరేష్ ఉన్నారు.

గద్దర్ మృతి ప్రజా ఉద్యమాలకు తీరనిలోటు



జిల్లా కేంద్రంలో కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న సంఘాల నాయకులు

గద్వాల అర్బన్: విప్లవ కవి, ప్రజాగాయకుడు గద్దర్ మరణం ప్రజా ఉద్యమాలకు తీరనిలోటని పలు సంఘాలు, పార్టీల నాయకులు అన్నారు. గద్దర్ మృతిపై సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటస్వామి, నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ రంజిత్‌కుమార్, సీపీఐ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు, ఎంఐఎం జిల్లా అధ్యక్షుడు మున్నాభాషా, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజీవ్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. నడిగడ్డ హక్కుల పోరాట సమితి కార్యాలయంలో శనివారం గద్దర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అదేవిధంగా ప్రజా, విద్యార్థి, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో స్థానిక కృష్ణవేణి చౌరస్తాలో కొవ్వొత్తులతో నివాళులర్పించారు.

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలం ఎర్రవల్లి చౌరస్తాలో పలు సంఘాల నాయకులు గద్దర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మృతి ప్రజలకు తీరని లోటన్నారు.

అలంపూర్: ప్రజాయుద్ధనౌక గద్దర్ మరణం ప్రజా ఉద్యమాలకు తీరనిలోటని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు, జిల్లా అధ్యక్షుడు గట్టు మారెన్న ఆదివారం ప్రకటనలో పేర్కొన్నారు. బాల్యం నుంచి తుదిశ్వాస విడిచేవరకు కష్టజీవుల తరఫున పోరాడారని కొనియాడారు. తన గానంతో కోట్లాది ప్రజలను చైతన్యపర్చిన గొప్ప నాయకుడని, ఆయన ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలన్నారు. కేవీపీఎస్ జిల్లా కమిటీ తరఫున ఆయన మృతికి ప్రగాఢ సంతాపం తెలిపారు.

దుండగులను శిక్షించాలి



ఎస్ఐకి ఫిర్యాదు చేస్తున్న బీఎస్పీ నాయకులు

ఉండవెల్లి: అలంపూర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను చింపేసిన దుండగులను శిక్షించాలని బీఎస్పీ నాయకులు కోరారు. ఈ మేరకు ఆదివారం స్థానిక ఎస్ఐ బాలరాజుకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అలంపూర్ చౌరస్తాలోని ఫ్లైవర్‌పై బీఎస్పీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను చింపేయడం సరికాదన్నారు. బాధ్యులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు ప్రభుదాసు, శోభారాణిగౌడ్, శివశంకర్‌గౌడ్, మహేష్, రామకృష్ణ, నాని, శరత్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.